




జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

అన్ని వర్గాల సంక్షేమమే

ప్రభుత్వ ధ్యేయం

తెలంగాణను ప్రపంచ వేదికపై ఆవిష్కరించడంలో విజయం సాధించాం

రాష్ట్ర అభివృద్ధే అమరులకు అసలైన నివాళి



పోతరాజు విన్యాసం చేస్తున్న ఓ విద్యార్థి

తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి విచ్చేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఆప్యాయంగా పలకరించి సత్కరించారు. మహిళా సంఘాలకు రుణ మంజూరు చెక్కులు అందజేశారు. వేడుకల్లో ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నృత్య ప్రదర్శనలు చేసిన చిన్నారులకు ముఖ్యమంత్రి సలహాదారు, కలెక్టర్ నారాయణరెడ్డి జ్ఞాపికలను అందజేశారు.

- విదేశీ పెట్టుబడులు భారీగా తీసుకొచ్చాం
- హైదరాబాద్ వేదికగా పలు గ్లోబల్ ఈవెంట్లు నిర్వహించాం
- 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు నిర్ణయానికి స్పందన
- ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

రంగారెడ్డి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై ఆవిష్కరించడంలో విజయం సాధించామని సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్ర అభివృద్ధే అమరులకు అసలైన నివాళి అని అన్నారు. నగర శివారులో ఫ్యూచర్ సిటీ నిర్మించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. అభివృద్ధి ప్రణాళికలో రాష్ట్రాన్ని మూడు జోన్లుగా వర్గీకరించినట్లు తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల నగరాన్ని కోర్ అర్బన్‌గా, ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని అర్బన్‌గా, రీజినల్ రింగ్ రోడ్డు ఆవల ప్రాంతాన్ని రూరల్‌గా నిర్ణయించినట్లు తెలిపారు. అమెరికా, దక్షిణ కొరియా, సింగపూర్, దావోస్, జపాన్ దేశాలలో పర్యటించి రాష్ట్రానికి

మిగతా 8వ పేజీలో...

రూ.80.02 కోట్లు అందజేత

జీవన జ్యోతి మహిళా సమాఖ్యకు రూ.80.02 కోట్ల చెక్కును, మెప్మా ద్వారా జిల్లాలోని 385 మహిళా సంఘాలకు రూ.52 కోట్ల రుణాల చెక్కును వేం నరేందర్‌రెడ్డి అందజేశారు.

విత్తనాల పంపిణీ..

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలువురు రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖలకు సంబంధించి స్టాల్స్‌ను సందర్శించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు



భారత జవాన్ల వేషధారణలో విద్యార్థుల ప్రదర్శన

దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



శిక్షణార్థులతో వెంకయ్యనాయుడు

» మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

శంషాబాద్ రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో మన భాగస్వామ్యం ఏమిటని ప్రతీ పౌరుడు ఆత్మ విమర్శ చేసుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఉద్బోధించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని ముచ్చింతల్ స్వర్ణభారత్ ట్రస్టులో శిక్షణార్థులు, భూభారతి ఆర్ఓఆర్ లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణార్థులతో సోమవారం ఆయన ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ముప్పవరపు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు హర్షవర్ధన్, స్వర్ణభారత్ ట్రస్టు సుబ్బారెడ్డి పాల్గొన్నారు. రైతులు, మహిళలు, యువత అభివృద్ధిపై స్వర్ణభారత్ ప్రధానంగా దృష్టి పెట్టిందని వెంకయ్యనాయుడు అన్నారు. ట్రస్టు సేవలను విస్తరించడంలో మిత్రుల సహకారాన్ని గుర్తు చేసుకున్న ఆయన ఈ స్ఫూర్తిని ప్రతీ ఒక్కరూ అందిపుచ్చుకొని సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని సూచించారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, సమర్థత సౌలభ్యాన్ని తీసుకువచ్చేందుకు భూభారతి పథకం ప్రవేశపెట్టడంలో తెలంగాణ ప్రభుత్వ ఆలోచన మంచిదన్నారు. నైపుణ్యం కలిగిన యువత వికసిత భారతాన్ని సమగ్రంగా నిర్మించగలదన్న వెంకయ్యనాయుడు ఫలితాన్ని పొందేందుకు ఎంత శ్రద్ధాసక్తులు చూపిస్తారో ఆ ఫలితాన్ని పొందేందుకు ఉపయోగించే పద్ధతుల విషయంలో అంతే శ్రద్ధను చూపించాలన్నారు. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా కన్నతల్లి, జన్మభూమి, మాతృభాష, మాతృదేశం, చదువు చెప్పిన గురువులను మరవొద్దన్నారు. ఒత్తిడిని జయించేందుకు వ్యాయామం, ధ్యానం, యోగా అలవాటు చేసుకోవాలన్నారు. సూర్యరశ్మి, పచ్చదనం,వ్యాయామం, ఆహార క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మిత్రులు ఈ ఆరు ఎల్లవేళలా మనతో ఉంటే అంతకు మించి వైద్య సహాయం అవసరం లేదన్నారు.

సాయికిరణ్‌కు 590వ ర్యాంక్

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ చూపిన షాద్‌నగర్ విద్యార్థి



షాద్‌నగర్, జూన్ 2(ఆంధ జ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో షాద్‌నగర్ విద్యార్థి ఆలిండియా ర్యాంక్ సాధించాడు. సోమవారం విడుదలైన ఫలితాల్లో ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి గ్రామం దేవునిబండ తండాకు చెందిన పల్త్యావత్ జగన్-విజయ దంపతుల కుమారుడు పల్త్యావత్ సాయి కిరణ్ ఎస్టీ కేటగిరీలో ఆలిండియా 590 ర్యాంకు సాధించాడు. అయితే సాయి కిరణ్ 10వ తరగతి వరకు షాద్‌నగర్‌లోని కుంటబడి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదివాడు. ర్యాంక్ సాధించిన సాయికిరణ్‌ను షాద్‌నగర్ ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్ అభినందించారు.

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య

బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు

7

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

నేటి నుంచి 'భూ భారతి' రెవెన్యూ సదస్సులు

23వ తేదీ వరకు నిర్వహణ.. జిల్లాలో ఏర్పాట్లు పూర్తి

దరఖాస్తులు స్వీకరించనున్న అధికారులు



రంగారెడ్డి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి నూతన రెవెన్యూ చట్టం 2025 అమలుకు సర్వం సిద్ధమైంది. జిల్లాలోని కొందుర్గు మండలంను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గత నెల 5వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సదస్సులో 573 అర్జీలు రాగా 464 ఆమోదించారు. కేవలం 109 అర్జీలను వివిధ కారణాలతో తిరస్కరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని ఈ చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈనెల 3వ తేది (మంగళవారం) నుంచి 23వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. దరఖాస్తుల స్వీకరణ కోసం కౌంటర్, దరఖాస్తుదారులకు సహకరించేలా

మిగతా 8వ పేజీలో...

ప్రణాళికాబద్ధంగా సాగాలి

» ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరగాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునిత ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఆఫీసు నుంచి ప్రారంభమైన ర్యాలీ, చౌరస్తా వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలో రూ.50కోట్ల టీఎఫ్ఐడీసీ నిధులతో ప్రతీ కాలనీలో అభివృద్ధి పనులను చేపడతామన్నారు. వన మహోత్సవంలో నాటే మొక్కలు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. విద్యుత్ తీగల కింద మొక్కలు నాటొద్దన్నారు.



వైభవంగా బొడ్రాయి పండగ

షాబాద్ మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో బొడ్రాయి పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. బొడ్రాయి వద్ద ఉదయం నుంచి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ ప్రజలందరూ చల్లంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

షాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి)

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



రంగారెడ్డి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నారు. ఇందుకోసం సోమవారం కలెక్టరేట్‌లో ఎస్ఈ నారాయణతో పాటు అధికారులు స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గుల నియంత్రణ, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కోసం త్వరలో సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. స్థల పరిశీలనలో డీఈ, ఏడీఈ, ఏఈ ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు.

రెండో ఫేజ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

మహేశ్వరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దోస్త్ 2వ ఫేజ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ సంగి రమేష్ అన్నారు. విద్యార్థులు మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మొదటి ఆప్షన్‌గా ఎంచుకోవాలన్నారు. మహేశ్వరం డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో 240 సీట్లు ఉన్నాయని, దీనికోసం ఆన్‌లైన్‌లో రూ.400 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి 8 వరకు రిజిస్ట్రేషన్ చేసుకొని వెబ్ ఆప్షన్లకు 9వ తేదీ వరకు గడువు ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9866341172, 9110149610 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆధునిక పద్ధతుల్లో సేద్యం

రైతులకు లాభదాయకం

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగు చేయడం ద్వారా పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. వ్యవసాయ పరిశోధన ఫలితాలు, మేలు రకం వంగడాలు పరిశోధన కేంద్రాలకే పరిమితం చేయకుండా రైతుల ముంగిటికి తీసుకుపోవాలని ఆయన సూచించారు. ఆమనగల్లు రైతు వేదికలో సోమవారం నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా వరి విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటించాలన్నారు. వానాకాలం పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతన ర్సింహ్మా, వైస్ చైర్మన్ గూడూరు బాస్కర్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఏవో శ్రీనివాస్ గౌడ్, ఏడీఏ శోభారాణి, వ్యవసాయ శాఖ వేత్త డాక్టర్ కల్పన పాల్గొన్నారు.

కళతప్పిన ఆవిర్భావ వేడుకలు!

ధారూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ వేడుకలను అధికారులు నామ్‌కేవాస్తేగా నిర్వహించడంపై కొంతమంది అధికార పార్టీ నాయకులు రుసరుసలాడారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాల్సి ఉండగా అధికారులు మొక్కుబడిగా మామ అనిపించటంతో కార్యక్రమం చప్పగా సాగిందని వారు అసంతృప్తి వ్యక్తంచేశారు. కొన్నిచోట్ల ప్రజలు, నాయకులు వెళ్లే వరకూ జాతీయ జెండాను సిద్ధం చేయకపోవడం, వీరు అక్కడికి వెళ్లిన తర్వాతే తాపీగా జెండాను సిద్ధం చేసి ఎగురవేశారని, కార్యాలయాలను ముస్తాబు చేయలేదని పార్టీ నాయకులు తప్పుబట్టారు. కొన్నిచోట్ల తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' పాటను తాము చెబితేనే ప్లే చేశారని చర్చించుకుంటున్నారు. పరిపాలన తమ చేతుల్లో ఉందని అధికారులు వేడుకలను మమ అనిపించి చేతులు దులుపుకున్నారని, ఆవిర్భావ వేడుకలు కళ తప్పాయని కాంగ్రెస్ నాయకులు అసహనం వ్యక్తంచేశారు.

100డేస్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం



ఇందిరా చౌక్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు

తాండూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 'ఒక మార్పు-అభివృద్ధికి మలుపు-స్వచ్ఛతపై తొలి అడుగు' అనే నినాదంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (సీడీఎంఏ) డైరెక్టర్ శ్రీదేవి ఆదేశాల మేరకు 100డేస్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుట్టారు. తాండూరు మున్సిపాలిటీలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోమవారం 100డేస్ ప్రోగ్రామ్ లోగోను ఆవిష్కరించి జెండాఊపి ర్యాలీని ప్రారంభించారు. అధికారులు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది, జవాన్లు, ఆర్పీలు, కార్మికులు కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి లారీపార్కింగ్, పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లి ఇందిరాచౌక్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, ధారాసింగ్, విజయలక్ష్మి రత్నమాల, విక్రం సింహారెడ్డి పాల్గొన్నారు.

శామీర్‌పేట్: ప్రభుత్వం చేపట్టిన 100రోజుల కార్యాచరణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని తూంకుంటలోని రాజీవ్ రహదారిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంయుక్త, ఎంపీవో వినూత్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అవతరణ వేడుకలు

వికారాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 11వ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ ప్రతీక్ జైన్ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కోర్టులో జిల్లా న్యాయాధికారి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో కార్యాలయంలో వాసుచంద్ర, ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ హన్మంత్‌రావు, గ్రంథాలయ ఆవరణలో చైర్మన్ రాజేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, గాంధీ పార్కులో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనారాయణ, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, జాతీయ జెండాలను ఆవిష్కరించగా, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేసి సంబురాలు నిర్వహించుకున్నారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు ఆయా పార్టీల నాయకులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.



జాతీయజెండా ఎగురవేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు ఎస్పీ హన్మంతు

వేడుకల్లో పాత తెలంగాణ తల్లి ఫొటో

బషీరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని బషీరాబాద్ మండలంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అయితే పలు చోట్ల గత ప్రభుత్వ హయాంలోని తెలంగాణ తల్లి ఫొటో పెట్టి వేడుకలను జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నూతన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నూతన తెలంగాణ తల్లి ఫొటోను వేడుకల్లో ఆవిష్కరించాల్సి ఉండగా పలుచోట్ల పాత తెలంగాణ తల్లి ఫొటోతో ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం చర్చనీయాంశమైంది. తెలంగాణ తల్లి నూతన ఫొటోను సిద్ధం చేసుకోకపోవడంపై కాంగ్రెస్ నేతలు పలువురు మండిపడుతున్నారు.

అభివృద్ధిలో రాష్ట్రం ముందడుగు

చేవెళ్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం చేవెళ్లలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం అభ్యుదయ రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన విత్తనాలను పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాసంక్షేమం కోసం పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సురేష్‌బాబు, ఏవో శంకర్‌లాల్, తహసీల్దార్ కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, కృష్ణారెడ్డి, ఆగిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా విష్ణు సహస్రనామ మహాయజ్ఞం

ఆమనగల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని నిత్య శుద్ధానంద స్వామి క్షేత్రం, శ్రీరామ దూత ఆశ్రమంలో సోమవారం 130వ విష్ణు సహస్రనామ మహాయజ్ఞం, శుద్ధానందస్వామి చతుర్థ పుణ్యారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు తరలివచ్చారు.సాయంత్రం వరకు యజ్ఞపూజలు కొనసాగాయి. సమాజ శ్రేయస్సు కోసం ప్రతీ ఒక్కరు దైవచింతనతో మెలగాలని స్వామీజీలు సూచించారు. కార్యక్రమంలో నటరాజ్ యాదయ్య, వెంకటయ్య, యుగంధర్‌రెడ్డి, అర్థం లక్ష్మయ్య, రామ్మోహన్ పాల్గొన్నారు.



మహాయజ్ఞంలో మాట్లాడుతున్న స్వాములు

ఉత్తమ సేవలకు అవార్డులు

కులకచర/యాలాల/తాండూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో కులకచర్ల అధికారికి ఉత్తమ అవార్డు లభించింది. పంచాయతీ కార్యదర్శి, ఎంపీవో భాస్కర్‌గౌడ్ జిల్లా స్థాయి ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో సోమవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా అవార్డు, ప్రశాంసాపత్రం అందుకున్నారు. అలాగే యాలాల మండల ఎంపీవో యాదయ్య ఉత్తమ సేవా ఉద్యోగిగా , దుద్యాలతహసీల్దార్ కిషన్‌నాయక్, డీటీ వీరేశ్‌బాబు, ఆర్ఐ నవీన్‌కుమార్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. తాండూరు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తాండూరు పోలీస్‌స్టేషన్‌తో పాటు కొడంగల్, వివిధ పోలీస్‌స్టేషన్లలో క్రైం బ్రాంచ్‌లో చేసిన సేవలకు గానూ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.



భాస్కర్‌గౌడ్ | యాదయ్య | కిషన్‌నాయక్ | మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వన్‌నేషన్ - వన్ ఎలక్షన్‌పై
అవగాహన కల్పించాలి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పరిగి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీజేపీ కార్యకర్తలకు సూచించారు. పరిగిలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఫంక్షన్‌హాల్‌లో వన్‌నేషన్-వన్ ఎలక్షన్‌పై సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎప్పుడు, ఏదో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూనే ఉంటాయని, దీనివల్ల నిబంధనలు అభివృద్ధికి ఆటంకం కల్గిస్తున్నాయని తెలిపారు. వన్‌నేషన్, వన్ ఎలక్షన్ విధానానికి అన్ని రాజకీయ పార్టీల మద్దతు అవసరమన్నారు. ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు, అభివృద్ధికి ఆటంకం లేకుండా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విశ్లేషకులు డాక్టర్ పి.భాస్కరయోగి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి జనార్ధన్‌గౌడ్, కన్వీనర్ రాంచందర్, కో-కన్వీనర్ రమేశ్, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, మారుతికిరణ్, గిరమోని శ్రీనివాస్, తాండూరు రమేశ్, బాలకిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల కూల్చివేతలపై రగడ

ఎమ్మెల్యే వద్దకు పంచాయితీ

బల్దియా అధికారుల తీరుపై మండిపాటు

తాండూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో అధికారులు ఆక్రమణలను కూల్చివేతలపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. అధికార పార్టీ నాయకులు ఈ పంచాయితీని ఎమ్మెల్యే వద్దకు చేర్చారు. మరోవైపు కూల్చివేతలపై బల్దియా అధికారులు ద్వంద వైఖరి అవలంబిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గతనెల 31న ప్రారంభమైన కూల్చివేతలు శనివారం వరకు జరిగాయి. పెద్దలకు ఒక న్యాయం పేదలకు మరొక న్యాయమంటూ అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు మండిపడుతున్నారు. తాండూరు ఇందిరాచౌక్ నుంచి బస్టాండ్ వరకు ఇరువైపులా కూల్చివేతలు ముందుగా ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారి మురుగు కాల్వపై ఉన్న అక్రమణలను, పైన ఉన్న చిన్నపాటి షెడ్‌లను తొలగించారు. ట్రాఫిక్ అంతరాయం పేరిట చేపడుతున్నఈకూల్చివేతల్లో కొన్నింటికి మినహాయింపు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నలు కురిపిస్తున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించి ఎందుకు ఆపేశారని పట్టణం మొత్తం చేపట్టాలని ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు శనివారం రాత్రి ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ రవూఫ్ ఫోన్‌లో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పేదల పొట్ట కొడతారా? అంటూ మున్సిపల్ అధికారుల తీరుపై అధికార పార్టీ నేత ఒకరు ప్రశ్నించారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ ఆసిఫ్ ఓ వీడియోను విడుదల చేస్తూ అక్రమంగా పార్కును కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న స్థలాన్ని వదిలేసి బల్దియా అధికారులు పేదల వెంట పడ్డారని ఆరోపించారు. మున్సిపాలిటీ అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించకపోతే సీడీఎంఏకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేదలకు అండగా నిలిచి న్యాయం చేయాలని కోరారు. ఆది, సోమవారాలు కూల్చివేతలు నిలిపివేయగా ప్రస్తుతం తాండూరులో ఈ కూల్చివేతల వ్యవహారం చర్చనీయాంశమైంది.



తాండూరులో ఆక్రమణల కూల్చివేత (ఫైల్)

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, జూన్2 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని శివారెడ్డిపల్లిలో సోమవారం ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన నాణ్యమైన విత్తనం, రైతన్నకు నేస్తం కార్యక్రమంలో పాల్గొని రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా హౌసింగ్ అధికారి కృష్ణ, ఎంపీడీవో గమ్యా, ఏవో ప్రభాకర్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, అయుబ్, రవికాంత్, నాయకులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంపు సంతోషకరం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అంగన్‌వాడీలు

కందుకూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంపునకు ప్రభుత్వ ఉత్తర్వుల జారీ శుభపరిణామమని మాజీ వైస్ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ఆయకుడు అఫ్జల్‌బేగ్ అన్నారు. సోమవారం నేదునూరులో అంగన్‌వాడీలతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంగన్‌వాడీ టీచర్ల రిటైర్మెంట్ వయసును 65ఏళ్లకు, బెనిఫిట్స్ రూ.2లక్షలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భారతమ్మ, సుమతి, యశోద, అనిత, ఆశావర్కర్లు సురేఖ, ఆయాలు, నాయకులు బాలయ్య, సంజీవరెడ్డి, మంజుల, బాబు, బి.సురేష్, వి.రాములు, శంకర్, మహేస్, పాండు పాల్గొన్నారు.

ఫీజులో రాయితీ ఇవ్వాలని జర్నలిస్టుల వినతి

రంగారెడ్డి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలని కోరుతూ సోమవారం టీడబ్ల్యూజేఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాత్రికేయులు కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన జర్నలిస్టులు పిల్లలకు ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల్లో 50శాతం ఫీజు రాయితీ ఇప్పించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థ 50శాతం ఫీజురాయితీ అమలయ్యేలా చూడాలని కోరారు. స్పందించిన కలెక్టర్.. దీనిపై ప్రైవేట్ విద్యా సంస్థలకు సర్క్యులర్ జారీ చేస్తామన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీకి చొరవ తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసినవారిలో టీడబ్ల్యూజేఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు, టీడబ్ల్యూజేఫ్ రంగారెడ్డి కమిటీ, జర్నలిస్టులు వి.శ్రీనివాసచారి, సురేష్, రఘపతి, శ్రీశైలం, గణేష్, చంద్రశేఖర్ ఉన్నారు.

ప్రజాపాలనలో అందరికీ న్యాయం



ఆమనగల్లులో కాంగ్రెస్ నేతల సంబురాలు

ఆమనగల్లు/కడ్తాల్, జూన్2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన ఘనత ఏఐసీసీ నేత సోనియాగాంధీకే దక్కిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగాలన్నదే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. ఆమనగల్లు, కడ్తాలల్లో సోమవారం బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, జగన్, మానయ్య, బీచ్యానాయక్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, సోనియాగాంధీకి కృతజ్ఞత వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అమరుల కుటుంబాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం కేశవులు, చందోజీ, జహంగీర్‌అలీ, జగన్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ధనుంజయ, కృష్ణానాయక్, పాండు రంగయ్య, కె.శ్రీనివాస్‌రెడ్డి, మండ్లీ రాములు, మైసయ్య బాబ, పరమేశ్, ఖాదర్, ఫరీద్, చేగూరి వెంకటేశ్, జహంగీర్‌బాబా, శ్రీను, హీరాసింగ్, రవి, రాజేశ్, యాదయ్య, అస్గర్ అలీ, బిక్య, రాంచందర్, జవహర్‌లాల్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు సింహాద్రినాయుడు ఎంపిక



షాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రాష్ట్రస్థాయి విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అభ్యసన పద్ధతులపై(బెస్ట్ ప్రాక్టీస్) నిర్వహించే ప్రదర్శనకు షాబాద్ మండలం వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సింహాద్రినాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ సోమవారం తెలిపారు. అన్ని జిల్లాల్లో ఉత్కృత అభ్యసన ప్రక్రియ ప్రదర్శన చేసిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారన్నారు. షాబాద్ మండలం వెంకమ్మగూడ పాఠశాల హెచ్‌ఎం ఎంపికయ్యారని తెలిపారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



ఇబ్రహీంపట్నంలో బడిబాట ప్రచార జాత



కొత్తూర్: బడిబాటలో పాల్గొన్న ఎంఈవో అంగోర్‌నాయక్

ఇబ్రహీంపట్నం/కొత్తూర్/కడ్తాల్, జూన్2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. నాగన్‌పల్లి, పోల్కంపల్లి, ఎన్గల్‌గూడ, రాయపోల్ టీచర్లు ఇల్లిల్లూ తిరిగి ప్రభుత్వ బడులపై ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని టీయూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.రాములయ్య అన్నారు. ఇంగ్లీష్ మీడియంలోనూ బోధన సాగుతోందన్నారు. కార్యక్రమంలో టీచర్లు జగన్నాథ్‌శర్మ, మల్లేష్, రామకృష్ణ, సుగంధ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని కొత్తూర్ ఎంఈవో అంగోర్‌నాయక్ అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొత్తూర్‌లో నిర్వహించిన బడిబాటలో ఆయన పాల్గొన్నారు. విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు ఉంటాయన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం దుస్తులు, మధ్యాహ్న భోజనం, రాగిజావ అందించడం జరుగుతుందన్నారు. ఫీజుల భారం లేకుండా ఉచితంగా విద్యను పొందవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు కాపాడాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులపైన ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రఘుపాల్, ప్రచార జాత అధ్యక్షుడు సాయన్న, ఉపాధ్యక్షుడు ప్రిన్స్ టీఎస్‌టీయూఎఫ్ నాయకుడు రాజ్‌కుమార్, శ్రీనివాస్, గౌరయ్య, పెంజర్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మీ, ఉపాధ్యాయులు ఫాతిమా, సునంద, అన్నపూర్ణ, భగవంతు, శ్రీనివాస్, రవికుమార్, రాజు, బాలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన టీచర్లతో నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.గోపాల్‌నాయక్ అన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య, జిల్లా కార్యదర్శి శంకర్‌లతో కలిసి బడిబాట ర్యాలీ, ప్రచారజాతను ప్రారంభించారు. ప్రభుత్వ స్కూళ్లలో పాఠ్య, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్‌లు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, టీచర్లు మల్లయ్య, కౌసల్య, విజయ్‌కుమార్, నాయకులు జగన్, నర్సింహమూర్తి, భాగ్యలక్ష్మి, నాగరత్నం పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ధారూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సోమవారం ధారూరు రైతు వేదికలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ బాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్‌లు రైతులకు విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి, ఏఈవోలు సంజూరాథోడ్, సంతోష్, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు..

ధారూరులోని మండల వనరుల కేంద్రంలో పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలోని 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థినీ విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలను ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సాజిదా బేగం, ఎంపీడీవో నర్సింహులుతో కలిసి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తాం

» ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, జూన్ 2, (ఆంధ్రజ్యోతి) : తాండూరు నియోజకవర్గంలో రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు అందరికీ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. సంగెంకలాన్‌లో సోమవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ధృవపత్రాలు అందజేశారు. గ్రామాల్లో మురుగు నీటి కాల్వలను నూతనంగా నిర్మించేందుకు రూ.20లక్షల నుంచి రూ.కోటి వరకు వెచ్చించి నిర్మాణం చేపడుతున్నామన్నారు. తాండూరు ఆర్టీసీ డిపోలో మెరుగైన రవాణా కోసం కొత్తగా 55 బస్సులను అందజేశారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరలో పూర్తవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్.రవీందర్‌గౌడ్, బాల్‌రెడ్డి, ఉత్తంచంద్, జెర్నె నాగప్ప, శరణు బసప్ప, వడ్డె శ్రీనివాస్, కరీముద్దీన్, ఎంఏ రహీం పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే క్రికెట్ పోటీలు

యువతలో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే బీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. మండలంలోని చెంగోల్ గ్రామ శివారులో సోమవారం కాంగ్రెస్ నాయకులు రాము యాదవ్ ఆధ్వర్యంలో 18రోజులపాటు బీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో తాండూరు మండలం గుంతబాస్పల్లికి చెందిన యువత జట్టు, పెద్దేముల్ మండలానికి చెందిన జట్టు పోటీపడగా, పెద్దేముల్ జట్టు గెలుపొందింది. విన్నర్ జట్టుకు మొదటి బహుమతి రూ.30వేలు, రన్నర్ జట్టుకు రెండో బహుమతి రూ.15వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా గౌడి శేఖర్, బెస్ట్ బౌలర్‌గా అంజీలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.రవీందర్‌గౌడ్, బాల్‌రెడ్డి, ఉత్తంచంద్, రాము యాదవ్, జెర్నె నాగప్ప, వడ్డె శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భక్తులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మర్పల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్లూర్ గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకలకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఆయన వెంట నాయకులు రాములుయాదవ్, సురేశ్, రామేశ్వర్ పాల్గొన్నారు.

అశోక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

యాచారం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్య చేసుకున్న దొడ్డి అశోక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన చింతపట్లకు వచ్చి అశోక్ భార్యాపిల్లలను ఓదార్చి ఆర్థిక సాయమందించారు. బాధిత కుటుంబానికి ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అంజయ్యను పరామర్శించారు. మాజీ ఎంపీ వెంట బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్, నాయకులు తాండ్ర రవీందర్, రమేశ్, జంగయ్యగౌడ్, రాయకంటి విజయ్‌కుమార్, కె.పురుషోత్తమ్ ఉన్నారు.

గురుకులాల కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

శంకర్‌పల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిపై చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్ డిమాండ్ చేశారు. శంకర్‌పల్లిలో సోమవారం మాట్లాడుతూ.. 'గురుకులాల్లో పిల్లలు చప్పట్లు కొట్టగానే టేబుల్‌పైకి భోజనం వస్తుందా? వాళ్ల పనులు వారే చేసుకోవాలి.' అని మాట్లాడిన ఆమెపై ప్రభుత్వం తీసుకోవాలన్నారు. తల్లి స్థానంలో ఉండి పిల్లలపట్ల ఇటాంటి వ్యాఖ్యలు సరికాదన్నారు. ఇకనైనా అధికారులు అవహేళన మాటలను మానుకోవాలని హితవు పలికారు.

స్టడీ మెటీరియల్ సమకూరుస్తాం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ గ్రంథాలయంలో విద్యార్థులకు కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన పుస్తకాలను సమకూరుస్తున్నామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డి బృందం సమకూర్చిన పుస్తకాలను చూసి ఎమ్మెల్యే అభినందించారు. మరిన్ని పుస్తకాలు తీసుకురావాలని 20వేల రూపాయలను అందించారు. అనంతరం ఎమ్మెల్యే కేశంపేట రోడ్డులో వచ్చే ఏడాదిలోపు కాంగ్రెస్ పార్టీ భవనాన్ని నిర్మిస్తామని శంకర్ తెలిపారు. పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. భవన నిర్మాణ మెటీరియల్‌ను తాను అందజేస్తానని, పనులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు అగ్గనూరి విశ్వం, బాబర్‌ఖాన్, పి.వెంకట్‌రాంరెడ్డి, చెన్నయ్య, బస్వంలు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. అలాగే వరి, జొన్న విత్తనాలను సోమవారం ఎమ్మెల్యే శంకర్ రైతులకు అందజేశారు. ఇన్చార్జి ఏడీఏ నిశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో విత్తనాలను పంపిణీ చేశారు. నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. ఆరు మండలాల రైతులకు వరి, జొన్న విత్తనాల ఉత్పత్తి చేసి రైతులకు విక్రయించేందుకు 305మంది రైతులకు 10కిలో చొప్పున కూనారం సన్నాల వరి విత్తనాలను, 56మంది జొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి

మొయినాబాద్ రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జీవితంలో మనశ్శాంతి కోసం ప్రతీ వ్యక్తి దైవచింతనను అలవార్చుకోవాలని చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీం భరత్ అన్నారు. వెంకటపూర్‌లో మహేందర్‌రెడ్డి సొంత డబ్బులతో నిర్మించిన పోచమ్మ ఆలయ పునఃనిర్మాణ వేడుకలో సోమవారం ఆయన పాల్గొన్ని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆలయాల్లోనే మనశ్శాంతి లభిస్తుందన్నారు. ఒత్తిడి తగ్గించుకునేందుకు ప్రతీ వ్యక్తి దైవ చింతనను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మణయ్య, నాయకులు బాలకృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవతరణ వేడుకలో గాంధీ ఫొటో పెట్టలేదని ఎమ్మెల్యే ఆగ్రహం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ వేడుకలో అధికారుల తీరు బాగాలేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే కాన్వాయ్‌కి పోలీసు ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేయలేదు. అలాగే ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ వద్ద నిర్వహించి జెండా విష్కరణలో తెలంగాణతల్లి, జయశంకర్‌ల ఫొటోలు పెట్టి మహాత్మాగాంధీ ఫొటో పెట్టలేదు. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు నాగిళ్ల గోపాల్‌గుప్తా ఎంపీడీవో బన్సీలాల్‌ను నిలదీశారు. నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే కల్పించుకొని.. 'మీరు గాంధీ ఫొటో పెట్టరు, ఎస్కార్టునూ పంపరు. ఇదేం నిర్లక్ష్యం?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారులకు స్వేచ్ఛ ఇస్తే నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. అలాగే ఉద్యమకారుల సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల వాగ్వాదంపై ఎమ్మెల్యే కోపగించుకున్నారు. ఆర్డీఓ ఆఫీసు వద్ద ఉద్యమకారులను, జర్నలిస్టులను ఎమ్మెల్యే సత్కరించారు. ఉద్యమకారుల జాబితాను మాజీ జెడ్పీటీసీ, ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి సిద్ధం చేశారు. టీఆర్ఎస్‌లో పనిచేసిన వారే ఉద్యమకారులా? ఇతర పార్టీల్లోని వారు పాల్గొనలేదా? అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్రాతి బాల్‌రాజ్‌గౌడ్ ప్రశ్నించారు. సకల జనులు, అన్ని పార్టీలు ఉద్యమిస్తేనే స్వరాష్ట్రం వచ్చిందని అన్నారు. ఆస్తులను అమ్ముకొని తాము ఉద్యమం చేసినాడు ఎవరూ రాలేదని వెంకట్‌రాంరెడ్డి బదులిచ్చారు. అయితే వాగ్వాదానికి ఇది సమయం, సందర్భం కాదని ఎమ్మెల్యే, ఇతర కాంగ్రెస్ నాయకులు వారిని శాంతపర్చారు.

11 ఏళ్లైనా న్యాయం జరగలేదు

» వీడీడీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

వికారాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు కావస్తున్నా వికారాబాద్ ప్రాంతానికి నీళ్లు, నిధులు, నియామకాల్లో న్యాయం జరగలేదని వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు, జిల్లా టీజేఏసీ మాజీ చైర్మన్ కె.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ. వికారాబాద్ జిల్లా అభివృద్ధి కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఎస్.శుభప్రద్‌పటేల్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు నోచుకోవడం లేదని విమర్శించారు. ఎమ్.సురేష్, ఎన్.దేవదాస్, మారుతి, మాణిక్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అంజిరెడ్డి, టి.శంకర్ పాల్గొన్నారు.

టెక్నాలజీ రంగంలో మరింత పరిశోధన జరగాలి



మాట్లాడుతున్న వైజ్‌వర్క్ సీఈవో మదన్‌కుమార్ శ్రీనివాసన్

ఇబ్రహీంపట్నం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ రంగంలో విప్లవాత్మక మార్పులొస్తున్నాయని, విద్యార్థులు వాటిని అందిపుచ్చుకొని పరిశోధనల దిశగా కృషిచేయాలని వైజ్‌వర్క్ సీఈవో డాక్టర్ మదన్‌కుమార్ శ్రీనివాసన్ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) సహకారంతో సోమవారం 'నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీస్-2025' పేరిట సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టెక్నాలజీలో భారత్ ప్రపంచ దేశాలతో పోటీ పడుతోదని, విదేశీ విద్యార్థులు ఉన్నత చదువులకోసం మన దేశానికి వస్తున్నారన్నారు. దేశ నలుమూలల నుంచి పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణులు, పీజీ, పరిశోధన విద్యార్థులు పాల్గొని విశ్లేషణలు చేశారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్‌చైన్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్ తదితర రంగాల్లో 180కిపైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. సదస్సులో సీఎస్ఐ నేషనల్ కార్యదర్శి రాజు ఎల్.కంచిబొట్ల, సీజీఐ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ రీనా ఎస్.శుక్లా, కోహ్లీ, వైస్ చాన్స్‌లర్ డా.సైనీ, డైరెక్టర్లు ఎస్.శ్రీనాథ్‌రెడ్డి, సంజీవ్ శ్రీవాస్తవ, జేడీ పార్థసారథి, అసోసియేట్ డైరెక్టర్లు హరీష్ కుంద్రా, రిషీసాయల్, ప్రిన్సిపాల్ వెంకట్రావు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ
దినోత్సవం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగరవేశారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల కల నెరవేరిన రోజు జూన్ 2 అని అన్నారు. అభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతోందని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యేలు ఉద్ఘాటించారు.


ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో జెండావిష్కరణ చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్ ఆర్డీవో ఆఫీసు వద్ద జాతీయ జెండాకు వందన సమర్పణ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఆర్డీవో సరిత


కడ్తాలలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


శంకర్‌పల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద జెండాను ఎగరవేసిన వైస్ చైర్మన్ కొశెట్టి చంద్రమోహన్


చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య


తలకొండపల్లిలో ఆవిర్భావ వేడుకల్లో ప్రభాకర్‌రెడ్డి, నాయకులు


ఆదిభట్ల మునిసిపాలిటీలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కమిషనర్ బాలకృష్ణ


కొత్తూర్ మునిసిపల్ కార్యాలయం వద్ద రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్, నాయకులు


కందుకూరు : కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగరవేస్తున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి


మహేశ్వరంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో శైలజ


ఇబ్రహీం పట్నం కోర్టు సముదాయంలో జెండావిష్కరణ చేసిన జడ్జి ప్రతాప్ నాయక్


శంషాబాద్: ఉత్సవాల్లో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య


యాచారం మండలం మేడిపల్లిలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ముందు జాతీయ జెండాను ఎగరవేసిన పోలీసులు


షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్‌లో తెలంగాణ ఉద్యమకారులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్


మొయినాబాద్ రూరల్: మొయినాబాద్ మండల కేంద్రంలో రాష్ట్ర అవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


షాబాద్‌లో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జెండాను ఎగరవేస్తున్న ఎంపీడీవో అపర్ణ

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ... ఈ నెల 3వ తేదీ నుంచి 20 వరకు చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. భూ భారతిపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. తహసీల్దార్, ఇతర అధికారుల రెండు బృందాలు సదస్సుల్లో పాల్గొంటారన్నారు. భూ రికార్డులు, పహనీలు, విలేజ్ మ్యాప్, 1ఏ, 1బీ, ఆర్‌వోఆర్ తదితర సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. సదస్సులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగుతాయన్నారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ

శంకర్‌పల్లి: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్ తెలిపారు. 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సదస్సులను నిర్వహిస్తామని తెలిపారు. భూ వివాదాల నివారణకు ప్రభుత్వం భూభారతి చట్టం తెచ్చిందన్నారు.

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. రెండు బృందాలు పర్యటించి సమస్యలు పరిష్క రిస్తాయన్నారు.

తలకొండపల్లి: తలకొండపల్లి మండలంలో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగార్జున తెలిపారు.

ఆమనగల్లు: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లలిత తెలిపారు. 16వ తేదీ వరకు ఆమనగల్లు మండలంలో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

కేశంపేట: నేటి నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ అజంఅలీ తెలిపారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు.

చౌదరిగూడ: మండలంలో రెవెన్యూ సదస్సులను నేటి నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తామని తహసీల్దార్ జగదీశ్వర్ తెలిపారు.

షాబాద్: నేటి నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అన్వర్ తెలిపారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి వంద రోజుల కార్యాచరణ

ఆమనగల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల కార్యాచరణ అమలుచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఒక మార్పు-అభివృద్ధికి మలుపు నినాదంతో పారిశుధ్యం, సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధి, వనమహోత్సవం, సమస్యల పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం కమిషనర్ శంకర్‌నాయక్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆమనగల్లు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

చేవెళ్ల: చేవెళ్ల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక సెప్టెంబరు పదో తేదీ వరకు కొనసాగుతుందన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కరిణి వద్ద ఆర్డీవో చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ర్యాలీని ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులను సత్కరించారు. స్వచ్ఛత, పరిశుభ్రతలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, ప్యాక్స్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, వసంతం, ఆగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆదిభట్లలో వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆదిభట్ల: ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆదిభట్ల మునిసిపాలిటీలో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి దిశగా కృషిచేస్తానని కమిషనర్ బాలకృష్ణ అన్నారు. సిబ్బంతో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాలు నిర్వహణ, శానిటేషన్ సమస్యల పరిష్కరించి మునిసిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

(ఐదో పేజీ తరువాయి)

భారీగా పెట్టుబడులు సాధించామన్నారు. హైదరాబాద్ వేదికగా అజూ గ్లోబల్ సమ్మిట్, బయో ఏషియా సదస్సు, మిస్ వరల్డ్ పోటీలను విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.

హైదరాబాద్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధికి ప్రణాళికలు

హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మెట్రోవిస్తరణకు శ్రీకారం, జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ విలీనం చేయాలన్న ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చినట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో నాలుగు కీలక అంశాలు ఉన్నాయన్నారు. పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి ఇన్ఫ్రాడెవలప్మెంట్, పారదర్శక పాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. లక్ష్యాల సాధనకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఇన్ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ, టూరిజం పాలసీలను ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. ఈ విజన్ డాక్యుమెంట్ భవిష్యత్ తెలంగాణకు భగవద్గీత లాంటిదన్నారు.

ఆడ బిడ్డలను కోటీశ్వరులుగా చేసేందుకు...

రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. జిల్లాలో ఉచిత ప్రయాణం ద్వారా 1.20కోట్ల రూపాయలను మహిళలు ఆదా చేసుకున్నారని తెలిపారు. రూ.500కే వంట గ్యాస్ ద్వారా జిల్లాలో 2.1లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందన్నారు. గృహజ్యోతి కింద 200యూనిట్లు వరకు 2024 మార్చి నుంచి 2025 ఏప్రిల్ వరకు జిల్లాలో రూ.12.07కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలన్న లక్ష్యంతో తొలి విడతలో 17,440మంది లబ్ధిదారులకు ఎంపిక చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.1.6కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. జిల్లాలో 1.26 లక్షల మంది రైతులకు రూ.769.54కోట్ల రుణమాఫీ చేశామన్నారు. రూ.7,500కోట్లు రైతు భరోసా ఖాతాల్లో జమ చేశామన్నారు. 18,112టన్నుల వడ్లు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి 12వేల సాయం అందిస్తున్నామని, జిల్లాలో 10,399మందికి మొదటి విడతగా రూ.6.24కోట్లు ఖాతాల్లో వేశామన్నారు. యంగ్ ఇండియా మోడల్ స్కూల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, జిల్లాలో షాద్‌నగర్, కల్వకుర్తిలో నిర్మాణం ప్రారంభించినట్లు తెలిపారు. కొత్తగా 163 మెడికల్ ప్రొసీజర్లను చేర్చామని, జిల్లాలో 61,245 మందికి శస్త్రచికిత్సలు చేసి రూ.151.21కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు.


అమరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న వేం నరేందర్‌రెడ్డి

అమరులకు జోహార్లు..

తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద వేం నరేందర్‌రెడ్డి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రాచకొండ డీసీపీ సునీతారెడ్డి, రాష్ట్ర పట్టణ, ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, శంకర్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఆర్డీవోలు సంగీత, అనంత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. మొయినాబాద్ మండలం పెద్దమంగళారంకు చెందిన యాదిరెడ్డి తల్లి చంద్రమ్మ, సోదరుడు హోంరెడ్డి, అజీజ్‌నగర్‌కు చెందిన అరిగె సరిత తల్లిదండ్రులు అనిత-నర్సింహులును సన్మానించారు. అలాగే ఇబ్రహీంపట్నంకు చెందిన కాంత్రికుమార్ తల్లిదండ్రులు, నర్సింహులు, ఫరూక్‌నగర్‌కు చెందిన కొమ్ము యాదయ్య కుటుంబ సభ్యులు శివలీల, దినేష్‌చంద్ర తల్లి శశికళ, ప్రేమ్‌రాజ్ కుటుంబ సభ్యులను సన్మానించారు.

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ

మాడ్గుల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రతి గర్భిణి ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వాలంటే వారికి మెడిసిన్ అవసరమని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అన్నారు. ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సహకారంతో మండలంలోని సుద్దపల్లిలో సోమవారం గర్భిణులు ప్రియాంక, భాగ్య, ఉశారాణి, నాగమ్మ, మంజుల, మౌనికలకు మెడికల్ కిట్లను అందదేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, కొప్పుల శివకుమార్, మాజీ వైస్ ఎంపీపీ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

మొయినాబాద్ రూరల్, జూన్2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌండ్ల నిరంజన్‌గౌడ్ అన్నారు. నక్కపల్లిలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. నిజమైన నిరుపేదలకే ఇళ్లు మంజూరు తమ లక్ష్యమన్నారు. ఎవరైనా పేదలు జాబితాలో లేకున్నా గుర్తించి ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, నాయకులు మల్లారెడ్డి, సబీర్, కృష్ణమయ్య, మల్లేష్, ఖలీల్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడు దేవేందర్‌గౌడ్ మృతి

కందుకూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కటికపల్లికి చెందిన బీజేపీ జిల్లా నాయకులు దేవేందర్ గౌడ్(42) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు కటికపల్లిలో జరిగాయి. మృతదేహానికి పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి శ్రీరాములయాదవ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. దేవేందర్‌గౌడ్ విద్యార్థి దశ నుంచి ఏబీవీపీకి, పార్టీకి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. దేవేందర్‌గౌడ్ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

షాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డితో కలిసి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన వారికి పార్టీ పదవులు ఇస్తుందన్నారు. ఎమ్మెల్యే యాదయ్య ఒంటెద్దు పోకడలుపోతే ఊరుకునేది లేదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులకు ఆయన సమాచారం ఇవ్వలేదన్నారు.

రాష్ట్ర అభివృద్ధే సర్కారు లక్ష్యం

మహేశ్వరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, రైతు రైతును రాజు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్ అన్నారు. సోమవారం మహేశ్వరంలో వరి విత్తనాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరైనా నకిలి విత్తనాలు విక్రయియిస్తే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ యాదయ్య, ఎడిఎ. సుధారాణి, ఎవో. నాగమణి, రైతులు తధితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రోజూ ఫిల్టర్ వాటర్ సరఫరా

షాద్‌నగర్ రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి పాఠశాలకు రోజూ ఫిల్టర్ వాటర్‌ను పంపిణీ చేస్తామని గ్రామానికి చెందిన నాల్లపురం అరుంధతివెంకట్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన పాఠశాలకు వెళ్లిన దంపతులు ఉపాధ్యాయుల కోరిక మేరకు విద్యా సంవత్సరం పూర్తియ్యే వరకు ఉచితంగా ఫిల్టర్ తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు.

ఆర్టీసీ విజిలెన్స్ కానిస్టేబుల్‌కు పురస్కారం

షాద్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో విజిలెన్స్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆకుల సిద్ధప్ప ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ ఉష ఆయనకు పురస్కారాన్ని అందజేశారు.డీఎం మాట్లాడుతూ.. బస్‌స్టాండ్‌లో జేబు దొంగలు, సెల్‌ఫోన్, ఆభరణాల దొంగల పట్టివేతలో సిద్ధప్ప కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అతడు బస్‌స్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్నప్పటి నుంచి చోరీలు తగ్గాయన్నారు. ఎంతోమంది దొంగలను పట్టించి పోలీసులకు అప్పగించారన్నారు.



భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

(ఐదో పేజీ తరువాయి)

హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంచనున్నారు. రిజిస్టర్లలో వివరాలను నమోదు చేస్తూ, డేటాను ఆన్‌లైన్‌లోనూ పొందుపరుస్తారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తున్నారు. మండలాల వారీగా బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, ఆర్‌ఐలు, రికార్డు అసిస్టెంట్లు, మండల సర్వేయర్, డాటా ఎంటీ ఆపరేటర్లను నియమించారు. వీరంతా గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అందుబాటులో ఉండి సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నివేదికను తహసీల్దార్లు ఏ రోజుకారోజు సదస్సు ముగిసిన అనంతరం కలెక్టర్‌కు అందించనున్నారు.

రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలు చేశారు. షెడ్యూల్‌ను అనుసరిస్తూ బృందాలు గ్రామాలకు చేరుకోవాలన్నారు. సదస్సుల సమాచారాన్ని రెండు రోజుల ముందుగానే ఆ గ్రామ ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. ఆరోపణలు, విమర్శలకు తావు లేకుండా, విచారణ ప్రక్రియను పూర్తి నిబద్ధత, నిజాయితీగా నిర్వహించాలన్నారు. అధికారులెవరైనా పొరపాట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. మార్గదర్శకాలు అనుసరిస్తూ సాదాబైనామా, పీఓటీలను క్రమబద్ధీకరిస్తామని దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలిపాలని సూచించారు.

క్రైం కార్నర్

పుష్కరిణిలో పడి వ్యక్తి మృతి

చేవెళ్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అదృశ్యమై యువకుడు పుష్కరిణిలో శవమై కన్పించాడు. ఈ సంఘటన సోమవారం చేవెళ్ల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్లలోని భగత్‌సింగ్‌కాలనీకి చెందిన గాదె రఘు(26) కూలి చేసుకునేవాడు. ఈ నెల 1న పనికి వెళ్తున్నట్లు చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయంత్రం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి వారి పుష్కరణిలో రఘు మృతదేహం తేలింది. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. రఘు అక్క రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రఘు మృతదేహం

కారు బోల్తా... డ్రైవర్ దుర్మరణం

షాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కారు బోల్తాపడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కొందుర్గు మండలం చిన్న ఉమ్మెంతాలకు చెందిన ఇసంతపురం శ్రీకాంత్(28) ఏడాది కాలంగా కొందుర్గుకు చెందిన వ్యక్తి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 1న కారులో షాబాద్ వచ్చాడు. తిరిగి చిన్నఉమ్మెంతాలకు తన స్నేహితుడు మహేశ్‌తో కారులో వెళ్తున్నారు. మరియాపురం దాటిన తరువాత కారు బోల్తాపడింది. దీంతో కారులోని ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబీకులు చేరుకొని వారిని అంబులెన్స్‌లో షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి శ్రీకాంత్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మహేశ్ షాద్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఆదివారం ఇబ్రహీంపట్నం చెరువులో గల్లంతైన రేష్మ(24) మృతదేహం సోమవారం లభ్యమైంది. హైదరాబాద్‌లోని ఫలక్‌నుమాకు చెందిన రేష్మ భర్త రెండేళ్ల క్రితం మృతిచెందాడు. ఆమెకు ఆరేళ్ల కుమారుడున్నాడు. ఆమె బండ్లగూడకు చెందిన స్నేహితులతో కలిసి ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఉన్న ఇబ్రహీం పాషా దర్గాను సందర్శించింది. పెద్దతూము వద్ద ఈతకని దూకి గల్లంతైంది. సోమవారం మృతదేహాన్ని వెలికితీసి కుటుంబీకులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

ఆదిభట్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కుర్మల్‌గూడకు చెందిన మతిస్థితిమితంలేని మహమ్మద్ రజియ(50) అదృశ్యమైనట్లు ఎస్సై సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. బాలాపూర్ మండలం కుర్మల్‌గూడకు చెందిన రజియ సోమవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసినవారు 8712662364/8712662094/8019574220 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.


రజియ(ఫైల్)